క్లుప్తంగా

సజ్జలను కలసిన పార్టీ ఈసీ సభ్యుడు బీవీ రావు



కైకలూరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి బుసనబోయిన వెంకటేశ్వరరావు(బీవీ రావు) మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. అనంతరం కైకలూరులో బీవీ రావు మాట్లాడుతూ పార్టీ ఈసీ సభ్యుడిగా తనను నియమించినందుకు సజ్జలకు కృతజ్ఞతలు తెలిపానని పేర్కొన్నారు.

విద్యుత్ శాఖ అధికారి అక్రమాలపై విజిలెన్స్ విచారణ

పామర్రు(తోట్లవల్లూరు): మండలంలోని దేవరపల్లిలో అక్రమ విద్యుత్ కనెక్షన్లపై తోట్లవల్లూరు సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీరు అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు రావడంతో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి విచారణకు ఆదేశించినట్లు యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ రాష్ట్ర కో–కన్వీనర్ జంపాన శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ విజిలెన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భవాని పర్యవేక్షణలో ఉయ్యూరులో విచారణ జరుగుతుందని తెలిపారు. దీనికి సంబంధించి విచారణలో భాగంగా విజిలెన్స్ ఎస్ఐ హారికా జెస్సీని కలిసి స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలిపారు. సంబంధిత అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు.

ఘనంగా శ్రీ చైతన్య ఫెస్ట్

గుడివాడ టౌన్ : స్థానిక శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ఫెస్ట్ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో నృత్యప్రదర్శన వీక్షకులను ఆకట్టుకున్నాయి. 2024–25 విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ గణపతి హోమం



గుడివాడ టౌన్ : స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీ లక్ష్మీ గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. బహుళ చవితి సంకష్టహర చతుర్థిని పురస్కరించుకుని ఈ హోమం నిర్వహించినట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 102 మంది ఉభయ దంపతులు ఈ హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలకవర్గం చైర్మన్ ఎస్. రాజేష్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

జమీగొల్వేపల్లి(పామర్రు): కిశోర బాలికలు తమ ఆరోగ్యం, విద్య, హక్కులపై అవగాహన కల్గి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.విజయ కుమారి పేర్కొన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి హైస్కూల్లో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం–3, పెదమద్దాలి సచివాలయం సెంటర్లు–6 పరిధిలోని కిశోర బాలికలకు అవగాహన కల్పించామని పేర్కొన్నారు.

గొడవ సర్ది చెప్పినందుకు దాడి

కైకలూరు: భార్యాభర్తలు గొడవ పడుతుండగా సర్ది చెప్పడానికి వెళ్లిన వారిపై కక్ష కట్టి దాడి చేసిన ఘటనపై కైకలూరు టౌన్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వింజరం గ్రామానికి చెందిన ధర్మరాజుల ఝాన్సీలక్ష్మి ఇంటి సమీపంలో ఈ నెల 2న తోడికోడలు, మరిది గొడవ పడుతున్నారు. ఝాన్సీలక్ష్మి భర్త నరేష్ వెళ్లి నచ్చజెప్పాడు. దీంతో కక్ష పెంచుకున్న తోడికోడలు మరుసటి రోజు తన ముగ్గురు సోదరులను తీసుకొచ్చి ఝాన్సీలక్ష్మి భర్త నరేష్, అత్తామామలపై దాడి చేయించింది. ఝాన్సీలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుందాం

గుడివాడ టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడాన్ని ప్రతిఒక్కరూ అడ్డుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా కార్యాచరణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ నుంచి నవంబర్ 22వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో సంతకాల సేకరణ ఉంటుందని పేర్కొన్నారు. నవంబర్ 23వ తేదీ నియోజకవర్గం నుంచి జిల్లా కేంద్రాలకు సేకరించిన సంతకాల పత్రాలు పంపుతామన్నారు. నవంబర్ 24న జిల్లా కేంద్రాల నుంచి పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలిస్తారని అనంతరం కోటి సంతకాల పత్రాల నివేదికను గవర్నర్‌కు అందజేస్తారన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 28న నియోజకవర్గ కేంద్రాల్లో, నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీ ఉంటుందని తెలిపారు. నేటి నుంచి నియోజకవర్గంలోని వార్డులు, గ్రామాల్లో ఈ సంతకాల సేకరణ కార్యక్రమం సాగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, నాయకులు సతీష్‌చంద్ర, చుండూరి శేఖర్, గోర్ల రామకృష్ణ, చింతల భాస్కరరావు, కందుల నాగరాజు, దేశిరెడ్డి రామ్మోహనరెడ్డి, తోట నాగరాజు, రంగారెడ్డి, కె. ఆంజనేయ ప్రసాద్, మాదాసు వెంకటలక్ష్మి, పి. కృష్ణారావు, దుద్దు చిన్నా, కె. గణపతి, బాజీ, షేక్ సయ్యద్, షమ్మి, తాజుద్దీన్ పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రతిభగల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

పామర్రు: ఉత్తమ ప్రతిభ గల విద్యార్థులకు కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలను అందజేసి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు సభ్యులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఏఎస్ఎం హైస్కూల్లో ప్రతిభ గల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈ నగదును అందజేస్తున్నట్లు తెలిపారు. యూనియన్‌లో వచ్చిన లాభాలలో కొంత భాగం సామాజిక సేవకు వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ విద్యావంతులు కావాలనదే యూనియన్ ఆకాంక్ష అని తెలిపారు. 2024–25 సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జి దినీషా ప్రియ, ఎల్ లోకేష్ కృష్ణను అభినందిస్తూ వారికి రూ.6వేల నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కార్యక్రమంలో పామర్రు వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఏఎస్ఎం ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి, నాయకులు కూసం పెద వెంకటరెడ్డి, బొమ్మారెడ్డి మాధవరెడ్డి, శేషురెడ్డి, పూర్ణ, సుబ్రమణ్యం, పాల కేంద్రం కార్యదర్శి ఆరేపల్లి శ్రీహరి, సూపర్‌వైజర్ రమేష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్న బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్ : నందివాడ 33 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతులు కారణంగా శనివారం నందివాడ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నందివాడ, తుమ్మలపల్లి, జనార్దనపురం, తమిరిశ, శ్రీనివాసపురం, వెన్ననపూడి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలం

పామర్రు: ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ కె జాన్ మోదీ ఆరోపించారు. స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద శుక్రవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 25 వేల మంది విద్యాశాఖకు అనుబంధంగా సమగ్ర శిక్ష ద్వారా విధులు నిర్వహిస్తున్నారన్నారు. సమగ్ర శిక్ష, కాంట్రాక్టు , ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని, ఎంటీఎస్ అమలు చేయాలని, హెచ్ఆర్ పాలసీ కల్పించాలని డిమాండ్ చేశారు. ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జేఏసీ ఏర్పడి 10 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా అక్టోబరు 12వ తేదీన దశాబ్ద ఐక్య భవిష్యత్తు పోరాట సభను విజయవాడ ఎంబీకే విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని తెలిపారు. ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా స్వాధీనం

కూచిపూడి(మొవ్వ): కృష్ణా జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు మచిలీపట్నం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు గురువారం అర్ధరాత్రి వరకు నిర్వహించిన తనిఖీల్లో వేలాది రూపాయల విలువ గల బాణసంచా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కూచిపూడి ఎస్ఐ ఎన్. విశ్వనాథ్ కథనం మేరకు మచిలీపట్నం స్పెషల్ పార్టీ ఆర్ఎస్ఐ చందనకిరణ్ తమ సిబ్బంది ఏసుబాబు, గౌరీ నాయుడు, నాగలక్ష్మి , పెదపూడి వీఆర్‌ఓ కేబీ రాజేంద్రప్రసాద్‌తో కలిసి పెదపూడి గ్రామ పరిధిలో పెడసనగల్లు రోడ్డులోని కటకం పూర్ణ చంద్రరావు(చిట్టి) షాప్‌లో లైసెన్స్ లేకుండా అక్రమంగా నిల్వజేసిన సుమారుగా రూ.60 వేల విలువ దీపావళి బాణసంచా సామగ్రిని మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. గోడౌన్ లో అక్రమంగా నిల్వ చేసిన దుకాణదారులపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

కుళాయిల మంజూరుపై విచారణ

కలిదిండి(కైకలూరు): కలిదిండి పంచాయతీ తేనెతుట్టు కదులుతోంది. అనుమతులు లేని అక్రమ కట్టడాలకు కేరాఫ్ అడ్రాస్‌గా మారిన కలిదిండి పంచాయతీపై ఇప్పుడు అక్రమ కుళాయిల మంజూరు కేసు విచారణ సాగుతోంది. కలిదిండి పంచాయతీలో పరిమితికి మించి అదనంగా కుళాయి కనెక్షన్లు మంజూరు, వీటికి నగదు వసూలు వంటి అభియోగాలపై వర్మ అనే వ్యక్తి లోకాయుక్తాలో పిటిషన్ వేశాడు. పంచాయతీలో 2012 –2013లో అప్పటి సర్పంచ్ షేక్ నజీమా, పంచాయతీ ప్రత్యేకాధికారి బీవీ.రామకృష్ణానాయక్, 2022–2023లో ప్రస్తుత సర్పంచ్ మసిముక్కు మారుతీ ప్రసన్న, ప్రసుత్త ఈఓ ఆర్‌వీ ఉదయ కుమార్‌ను బాధ్యులను చేస్తూ ఫిర్యాదు అందింది. ఇద్దరి పాలనలో 1,256 కుళాయిలలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. దీనిపై గుడివాడ ఆర్డీఓ అంబరీష్ ఆదేశాలతో కలిదిండి ఎంపీడీఓ ఆర్.ఫణింద్ర పంచాయతీలో శుక్రవారం విచారణ చేపట్టారు.

చట్టాలపై అవగాహన అవసరం

ముదినేపల్లి రూరల్: చట్టాలపై ప్రతి ఒక్కరికీ ప్రాథమిక అవగాహన ఉండాలని కైకలూరు సీనియర్ సివిల్‌జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి అన్నారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీలో న్యాయవిజ్ఞాన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రతిఒక్కరి ఆరోగ్యాన్ని కాపాడేందుకు వైద్యులు కృషి చేయాలన్నారు. వైద్యాధికారి శాంతిశ్రీ, ప్యానల్ న్యాయవాదులు పి.పవన్‌కాంత్, డి.శివప్రసాద్, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కైకలూరు: పాత కక్షల నేపథ్యంలో దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. కైకలూరు రూరల్ పోలీసుల కథనం మేరకు మండలంలోని నరసాయిపాలెం గ్రామానికి చెందిన బోయిన జయప్రకాష్(25)ను అదే గ్రామానికి చెందిన మాడపాటి రమేష్ బండతో ఈ నెల 2న దసరా ఊరేగింపులో దాడి చేశాడు. జయప్రకాష్‌ను విజయవాడలో ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. దాడిపై ప్రకాష్ తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదుపై రమేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా చికిత్స పొందుతూ జయప్రకాష్ మృతిచెందాడు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

కలిదిండి(కైకలూరు): గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని కలిదిండి మండల ఎంపీడీఓ ఆర్.ఫణీంద్ర అన్నారు. పడమటిపాలెం పంచాయతీలో పారిశుద్ధ్య పనులను అయన శుక్రవారం పరిశీలించారు.

బోధనేతర పనులు అప్పగించొద్దు

ముదినేపల్లి రూరల్: ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడం ప్రభుత్వానికి తగదని ఫ్యాప్టో నేతలు అన్నారు. ఈ మేరకు ఎంఈఓ–1 డి.రామారావుకు స్థానిక ఎమ్మార్సీ భవన్‌లో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకురాలు ఎన్.సాయి లక్ష్మి ఆధ్వర్యంలో నేతలు పాల్గొన్నారు.

అవినీతికి ఆస్కారం లేకుండా పనులు చేయాలి

ముదినేపల్లి రూరల్: ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతికి ఆస్కారం లేకుండా పనులు చేపట్టాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ఉపాధి హామీ పథకం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు పారదర్శకంగా ఉండేలా చేపడితే అవినీతికి ఆస్కారం ఉండబోదన్నారు. ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడినట్లు రుజువైతే సంబంధిత వ్యక్తులు ఏ పార్టీకి చెందినవారైనా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఆక్వా రంగానికి సబ్సిడీ విద్యుత్ ఊతం

కైకలూరు: ఆక్వా ఉత్పత్తులలో అగ్రగామిగా పేరొందిన కైకలూరు ప్రాంతంలో ఆక్వా రైతులకు సబ్సిడీ విద్యుత్‌తో మేలు జరుగుతోందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గోపవరంలో రూ.46 కోట్లతో నిర్మితమవుతున్న 2.20 కేవీ సబ్‌స్టేషన్ పనులను శుక్రవారం పరిశీలించారు. ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ భాస్కర్, చీఫ్ ఇంజినీర్ దీవన్‌కుమార్, ఎస్ఈ భాగ్యరాజు, విద్యుత్‌శాఖ గుడివాడ ఈఈ జీబీ.శ్రీనివాసరావు, కైకలూరు ఏడీ రామయ్య, ఎంపీపీ అడవి కృష్ణ, కోరుకొల్లు సర్పంచ్ లీలా కనకదుర్గ పాల్గొన్నారు.

వైభవంగా దివ్యకల్యాణం

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం –చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది. కల్యాణంలో పాల్గొని స్వామి, అమ్మవార్లకు పూజలు జరిపారు.

టపాసులు అక్రమంగా తయారు చేస్తే చర్యలు

గుడివాడరూరల్: దీపావళిని పురస్కరించుకుని మండలంలో ఎవరైనా అక్రమంగా టపాసులు తయారు చేస్తే చర్యలు తీసుకుంటామని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని బొమ్ములూరులో గతంలో అక్రమ టపాసులు తయారు చేసి పట్టుబడిన వ్యక్తుల ఇళ్లల్లో ఏమైనా టపాసుల నిల్వలు ఉన్నాయోమోనని అనుమానంతో శుక్రవారం ట్రైనీ ఎస్ఐ లోకేశ్వరి, సిబ్బందితో కలసి తనిఖీలు చేశారు.

వ్యక్తిపై పిచ్చికుక్కల దాడి

నందివాడ: నందివాడ మండలం రామాపురం గ్రామానికి చెందిన మేడేపల్లి నాగేశ్వరరావు ద్విచక్ర వాహనంపై పెదవిరివాడ వెళుతుండగా పిచ్చి కుక్కలు శుక్రవారం వెంబడించాయి. దీంతో అతడు వాహనంపై నుంచి కింద పడిపోయాడు. పిచ్చి కుక్కలు అతడిపై దాడి చేసి నాలుగు చోట్ల గాయపరిచాయి. తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావును గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.


విద్యార్థులకు సక్రమ నడవడిక ఉండాలి

నందివాడ: మండలంలోని రుద్రపాక జూనియర్ కళాశాల, విద్యార్థులకు ట్రాఫిక్, ఇతర అంశాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు సక్రమమైన నడవడిక కలిగి ఉండాలన్నారు. డ్రగ్స్, గంజాయి మత్తుపదార్థాలు వంటి వాటికి బానిస కాకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపి, వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈగల్ టీం, డయల్ 112, గుడ్, బ్యాడ్ టచ్, ట్రాఫిక్ నియమాలు, పోక్సో చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

విధి నిర్వహణకే ప్రాధాన్యం

మొవ్వ: మండల డెప్యూటీ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహిస్తూ గత నెల 30న ఉద్యోగ విరమణ చేసిన ఎంఎస్‌కే పరమాత్మ విధి నిర్వహణకే ప్రాధాన్యం ఇచ్చిన అధికారి అని డీఎల్‌పీఓ సంపత్‌కుమారి పేర్కొన్నారు. స్థానిక శ్రీ మండవ జానకి రామయ్య సులోచన క్షేత్రయ్య కల్యాణ మండపంలో ఎంపీపీ ఇందిర అధ్యక్షతన ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. పలువురు అధికారులు పరమాత్మ, హిమశ్రీ దంపతులను సత్కరించారు. ఎంపీడీఓ సుహాసిని, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, తహసీల్దార్ మస్తాన్ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

గుడివాడ టౌన్ : పట్టణంలోని ఆర్వో ప్లాంట్ల నిర్వాహకులు నీటి సరఫరాలో తీసుకోవాల్సిన అన్ని ప్రామాణికాలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం హాల్లో వాటర్ ప్లాంట్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల విజయవాడలో డయేరియా కేసులు నమోదుకు ఆర్వో ప్లాంట్‌లు నిర్వహణ సక్రమంగా లేకపోవడం కారణం అని నిర్ధారణ అయిందన్నారు. భద్రతాపరమైన ఏర్పాట్లలో లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. వాటర్ శాంపిల్స్ గుంటూరు ల్యాబ్‌కు పంపుతామని తెలిపారు. ఏ మాత్రం తేడా ఉన్నా ప్లాంట్‌లు మూసివేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, మున్సిపల్ ఇంజినీర్, వాటర్ వర్క్స్ డీఈ, ఏఈ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు చెల్లించాల్సిందే

గుడివాడ టౌన్ : టిడ్కో కాలనీ లబ్ధిదారులు బ్యాంకు రుణాలు తీసుకున్న ప్రతిఒక్కరూ లోన్ తిరిగి చెల్లించాల్సిందేనని యూనియన్ బ్యాంక్ అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం బ్యాంక్ అధికారులు టిడ్కో కాలనీలో పలువురు లబ్ధిదారులకు నోటీసులు అందించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కొందరు లబ్ధిదారులు రాజకీయ హామీలు నమ్మి అపోహలకు గురవుతున్నారన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను బ్యాంకు నెలసరి వాయిదాలు చెల్లించాల్సిందేనన్నారు. ప్రభుత్వం, టిడ్కో ఇప్పటికే స్పష్టంగా రుణాలు చెలింపులపై ప్రకటన జారీ చేసిందన్నారు. ఇల్లు కేటాయించిన అనంతరం లబ్ధిదారులకు ఏ విధమైన ఆర్థిక సాయం, రుణమాఫీ ఉండబోదని అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో లబ్ధిదారుడు విధిగా రుణాలు చెల్లించాలన్నారు. రుణాలు చెల్లించని పక్షంలో చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. వేలం ప్రకటనలు మొదలవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డెప్యూటీ రీజినల్ ఆఫీసర్ రామలింగారెడ్డి, రికవరి చీఫ్ మేనేజర్ రాకేష్, గుడివాడ బ్రాంచ్ మేనేజర్ త్రివేణి, సిబ్బంది, టిడ్కో ప్రతినిధి ఆనందరావు పాల్గొన్నారు.



టిడ్కో లబ్ధిదారులకు నోటీసులు అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

వసతిగృహాల్లో పరిశుభ్రత పాటించాలి

కైకలూరు: ప్రభుత్వ వసతి గృహాల్లో పరిశుభ్రతను తప్పక పాటించాలని కైకలూరు ఎంపీడీఓ రెబ్బ రాజబాబు పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం ఆశ్రమ పాఠశాలలో కామెర్లతో బాలికలు మృతి చెందడంతో అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆటపాక ఎస్సీ బాలికల హాస్టల్‌ను శుక్రవారం ఎంపీడీఓ పరిశీలించారు. ప్రధానంగా తాగునీరు, ఆహార పదార్థాల నాణ్యత, ఆరుబయట ఆవరణ, మరుగుదొడ్లను తనిఖీ చేశారు. పరిశుభ్రమైన వాతావరణంలో పిల్లలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని వార్డెన్‌ను ఆదేశించారు. విద్యార్థులకు జ్వరం వస్తే వెంటనే ఆరోగ్య సిబ్బందితో పరీక్షలు చేయించాలన్నారు. హాస్టల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయాలని ఆటపాక పంచాయతీ ఈఓ రవికిరణ్‌కు ఆదేశించారు.



ఆటపాక ఎస్సీ బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజబాబు

రుణాల అక్రమ మంజూరుకు సహకరించినవారిపై కేసు

గుడివాడరూరల్: పట్టణంలో స్వయం సహాయక సంఘాల పేరుతో రుణం తీసుకున్న వారికే మళ్లీ బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించిన వ్యవహారంపై మెప్మా ఆర్పీలు, సీసీలు, బ్యాంక్ సిబ్బందిపై విజయవాడకు చెందిన బ్యాంకుల పరిశోధన విభాగం అధికారులు గుడివాడ టూటౌన్ పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. టూటౌన్ పోలీసుల కథనం మేరకు గుడివాడ పట్టణంలో సుమారు 660 మంది స్వయం సహాయక సంఘాలకు తోడు నకిలీ గ్రూపులు ఏర్పాటు చేసి సుమారు రూ.5.77కోట్లు రుణాలు తీసుకున్నారని పేర్కొన్నారు. చట్ట ప్రకారం ఓ డ్వాక్రా సంఘంలో ఉన్న సభ్యులు ఒకే గ్రూప్‌లో సభ్యురాలిగా ఉండాలని తెలిపారు. గుడివాడలోని ఆర్పీలు పిల్లా శిరీష మరో 10 మంది, మెప్మా సీసీలు రాజేంద్ర, సుజాత అనే వ్యక్తులు ఒకే గ్రూపులో ఉన్నట్లు పలు రకాల ధ్రువపత్రాలు ఇచ్చారు. దీంతో బ్యాంక్ అధికారులు వీరికి వేరే బ్యాంకులో రుణం ఉన్నా మళ్లీ రుణం మంజూరుకు సహకరించారన్నారు. వీటిని గుర్తించిన బ్యాంకు పరిశోధన అధికారులు తమకు ఫిర్యాదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. వీరు తీసుకున్న రుణాల్లో రూ.3కోట్లకు పైగా రుణం చెల్లించారని పేర్కొన్నారు. ఇంకా వడ్డీతో సహా రూ.3.50కోట్ల దాకా చెల్లించాల్సి ఉందని తెలిపారు. బ్యాంక్ అధికారులకు కొందరు ఫిర్యాదు చేయగా బ్యాంకు పరిశోధన విభాగం విచారణ చేసి తమకు ఫిర్యాదు చేసిందని టూటౌన్ సీఐ కె.హనీష్ తెలిపారు. ఈ మేరకు ఆర్పీలు, మెప్మా, బ్యాంక్ సిబ్బందిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పీఐ పేర్కొన్నారు.

విద్యార్థులకు మానసిక ఆరోగ్యం ప్రధానం

గుడివాడ టౌన్ : స్థానిక గౌరీశంకరపురంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల్లో శుక్రవారం మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులు ప్రధానంగా మానసిక ఆరోగ్యం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఏకాగ్రత కలిగి ఉండాలని, మానసిక ఒత్తిడికి లోను కాకూడదని తెలిపారు. ప్రతి రోజూ నడక, ఈత, యోగా తదితర కార్యక్రమాల్లో పాల్గొని ప్రశాంతమైన మానసిక స్థితి కలిగి ఉండాలన్నారు.
కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ సతీష్‌చంద్ర, కో–ఆర్డినేటర్ జి. జీవన్, ఎన్. శరత్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఒత్తిడిని అధిగమించడానికి సరైన మార్గాలు అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన అవసరం

పామర్రు: ఎయిడ్స్ నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కల్గి ఉండి తగువిధమైన జాగ్రత్తలు వహించాలని పామర్రు సీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ తలారి సుదేశ్ బాబు అన్నారు. స్థానిక సీహెచ్‌సీ వద్ద 'ఎయిడ్స్‌ను ఇగ్నోర్ చేయవద్దు' అనే కార్యక్రమంలో భాగంగా ప్రచార రథాన్ని శుక్రవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థల సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో 'ఇగ్నోర్ చేయవద్దు మరొక్కసారి గుర్తు చేసుకోండి' కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లో ఎయిడ్స్, సుఖ వ్యాధుల పట్ల ప్రచార రథం ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ లింక్ వర్కర్సు కె వినయ్‌కుమారి, పి.దేవి పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

పమిడిముక్కల: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఐనపూరు హైస్కూల్ హెచ్ఎం తమ్మన వేణుగోపాలరావు అన్నారు. ఐనపూరు హైస్కూల్‌లో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల పట్ల లింగవివక్షత, అసమానతలు చూపకూడదన్నారు. సచివాలయ మహిళా పోలీస్ అఖిలవాణి మాట్లాడుతూ బాలికలకు విద్య చాలా అవసరమని తెలిపారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

కపిలేశ్వరపురంలో..

కపిలేశ్వరపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. బాల్య వివాహాల వలన కలిగే నష్టాల గురించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.